సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం : 26 : మే : 2023



సీఎం సమీక్షలో జిల్లా బాస్‌లు

సిరిసిల్ల: సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు.



వేములవాడలో భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను గురువారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కల్యాణకట్టలో తలనీలాలు, నిలువెత్తు బెల్లం పంపిణీ మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
39.0/29.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

థ్యాంక్స్.. కేసీఆర్ గారు



సాక్షి కథనాన్ని ట్విట్టర్‌లో పోస్టు చేసిన మంత్రి కేటీఆర్

ముస్తాబాద్(సిరిసిల్ల): 'థ్యాంక్స్ కాళేశ్వరం ప్రాజెక్టు.. కేసీఆర్ గారు..' అంటూ రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు ట్విట్టర్ వేదికగా పోస్టు చేశారు. 'సాక్షి'లో ఈనెల 23న 'మండు వేసవిలో మత్తళ్లు' శీర్షికన ప్రచురితమైన కథనాన్ని మంత్రి కేటీఆర్ గురువారం ట్విట్టర్‌లో పోస్టు చేసి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టులకు గోదావరి జలాలు మళ్లిన తీరు.. మల్లన్నసాగర్ జలాలతో నిండిన చెరువులు మత్తడి పోస్తున్న వైనాన్ని సాక్షి వివరించింది. మండు వేసవిలో ఎగువ మానేరు ప్రాజెక్టు నిండి చెక్‌డ్యామ్‌లు, చెరువులు అలుగులు పారుతున్న విధానాన్ని పేర్కొంది. దీనికి స్పందించిన మంత్రి కేటీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సీఎం కేసీఆర్ చేసిన కృషి ఫలితమే గోదావరి జలాలు తరలివచ్చాయని పేర్కొన్నారు.

రూ.30వేల కోట్ల లక్ష్యం



ఖాతాదారులతో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ వై.శోభ

వేములవాడ: ఈ ఏడాది రూ.30వేల కోట్ల లక్ష్యంతో వ్యాపారం చేస్తామని, గతేడాది రూ.25,504 కోట్ల వ్యాపారం చేసినట్లు తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ వై.శోభ పేర్కొన్నారు. వేములవాడ రాజన్నను గురువారం దర్శించుకున్న అనంతరం స్థానిక బ్రాంచ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 36 లక్షల మంది ఖాతాదారులతో 8 రీజియన్లలో 427 బ్రాంచ్‌లు, 1,700 మంది స్టాఫ్‌తో తమ బ్యాంక్ పనిచేస్తుందని తెలిపారు. గతేడాది రూ.12.610 కోట్ల డిపాజిట్లు, రూ.12,894 కోట్ల రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ ఏడాది మరో 14 శాతం వ్యాపారం పెంచబోతున్నామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు కొత్తగా 25 బ్రాంచ్‌లు ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. నారీశక్తి పథకం ద్వారా 3 లక్షల మంది లబ్ధి పొందారని, అవార్డు సైతం వచ్చిందన్నారు. రైతుల కోసం రైతునేస్తం స్కీమ్ అందుబాటులో ఉందన్నారు. డిజిటల్ బ్యాంకింగ్ విధానంలో నాలుగు అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. బీమా పథకంలో జాతీయ స్థాయిలో రెండు అవార్డులు అందుకున్నామని చెప్పారు. ఆర్ఎం సుశాంత్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్‌రావు సిబ్బంది ఉన్నారు.

ప్రధాని పనితీరు ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్లలో చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక భీమేశ్వరగార్డెన్‌లో గురువారం బూత్ కమిటీ, పట్టణశాఖ అధ్యక్షులతో సమావేశమయ్యారు. మే 30 నుంచి జూన్ 30 వరకు జనసంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రధాని పాలన గురించి వివరిస్తూ లబ్ధిదారులను కలవాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున, పట్టణాధ్యక్షుడు సంతోష్‌బాబు, రూరల్ మండలాధ్యక్షుడు జక్కుల తిరుపతి, నాయకులు సంటి అంజిబాబు, ముప్పిడి శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, కొమ్ముల సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

15, 20 తేదీల్లో సదరం శిబిరాలు

సిరిసిల్ల: జిల్లా ఆస్పత్రిలో జూన్ 15, 20వ తేదీల్లో సదరం శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు గురువారం తెలిపారు. 15వ తేదీన ఎముకల (ఆర్థోపెడిక్), 20న కంటి చూపు, వినికిడి సంబంధించిన శిబిరాలు నిర్వహిస్తామని వివరించారు. మీసేవ ద్వారా పొందిన స్లాట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, మెడికల్ డాక్యుమెంట్లు, ఫోన్ నంబరుతో హాజరు కావాలని సూచించారు.

ఆపరేషన్లు ఎప్పుడో ?

- కంటివెలుగులో అద్దాలతోనే సరి
- మొదటి విడతలో గుర్తించిన వారికి చేయలేదు
- కొనసాగుతున్న రెండో విడత పరీక్షలు
- మొదటి విడతలో 14,141 మంది గుర్తింపు
- రెండో విడతలో 5,015 మంది గుర్తింపు
- ఆపరేషన్ల కోసం పేదల ఎదురుచూపులు



కొలనూర్‌లో కంటి వెలుగు శిబిరం(ఫైల్)

జిల్లాలో కంటి వెలుగు స్వరూపం

జనాభా	: 6,19,530
పట్టణ జనాభా	: 1.33 లక్షలు
గ్రామీణ జనాభా	: 4.86 లక్షలు
జిల్లాలో గ్రామాలు	: 255
మున్సిపాలిటీ వార్డులు	: 67
వైద్య బృందాలు	: 26
ఏఆర్ యంత్రాలు	: 26
నిత్యం వైద్యశిబిరంలో పాల్గొనే సిబ్బంది	: 234
ఇప్పటికి జరిగిన కంటి పరీక్షలు	: 3,09,393



ఇతని పేరు బత్తుల నర్సయ్య. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన నర్సయ్యకు ఇరువై రోజుల కిందట ఊరిలోనే కంటి వెలుగు శిబిరం నిర్వహించి పరీక్షలు చేశారు. కళ్లల్లో శుక్లాలు ఉన్నాయని, ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఇతని పేరు రాసుకున్నారు. కానీ ఆపరేషన్ ఎప్పుడు చేస్తారో డాక్టర్లు, అధికారులు చెప్పలేదు. నర్సయ్యకు కళ్లు సరిగ్గా కనిపిస్తలేవు. ఆపరేషన్ చేయించుకోవాలని నర్సయ్య నిరీక్షిస్తున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఒక్క నర్సయ్యనే కాదు.. ఇలాంటి వారు వందలాది మంది పేదలు కంటి ఆపరేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

సిరిసిల్ల: కంటి ఆపరేషన్ల కోసం గుర్తించిన నిరుపేదలకు ఎదురుచూపులే దిక్కవుతున్నాయి. మొదటివిడతలో గుర్తించినవారికి ఇప్పటి వరకు ఆపరేషన్లు చేయకపోగా.. ఇప్పుడు రెండో విడత కంటి వెలుగును జిల్లాలో జనవరి 19న ప్రారంభించారు. 83 రోజులుగా 26 వైద్యబృందాలుగా 234 మంది సిబ్బంది కంటిపరీక్షలు చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 3,09,393 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 49,366 మందికి రీడింగ్ అద్దాలను, మరో 42,222 మందికి పాయింట్ అద్దాలను అందించారు. కళ్లల్లో వివిధ సమస్యలతో ఆపరేషన్ల కోసం 5,015 మందిని సిఫార్సు చేశారు. ఆర్థికంగా ఉన్న వారు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తుంటే.. పేదలు మాత్రం సర్కారు వైపు ఆశగా చూస్తున్నారు.

మొదటి విడతలో మొండి చెయ్యి

2018 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మొదటి విడత కంటివెలుగు పరీక్షలను ప్రారంభించారు. 2019 ఫిబ్రవరి వరకు కంటి పరీక్షలు చేశారు. జిల్లాలో 2.82 లక్షల మందికి పరీక్షలు చేసి దగ్గరిచూపు సమస్యలున్న 44,243 మందికి అద్దాలు అందించారు. దూరపు చూపు సమస్యలున్న మరో 41,340 మందికి కంటి అద్దాలు అందించారు. జిల్లా వ్యాప్తంగా 14,141 మందికి ఆపరేషన్లు చేయాలని గుర్తించి సిఫార్సు చేశారు. కానీ ఇప్పటి వరకు ఒక్కరికి కూడా కంటి ఆపరేషన్లు చేయలేదు. అప్పట్లో జిల్లాలో కంటి ఆపరేషన్లు చేసే ఆస్పత్రులు అందుబాటులో లేవు. హైదరాబాద్, వరంగల్ తీసుకెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేసినప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలించలేవు. కానీ రెండో విడతలోనూ కంటి ఆపరేషన్లు చేయాలని గుర్తించిన వారికి ఆపరేషన్లు చేస్తారా? లేదా అనేది స్పష్టత లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా నిరుపేదలు కంటి ఆపరేషన్ల కోసం పడిగాపులు కాస్తున్నారు.

శిబిరాలు కొనసాగుతున్నాయి



జిల్లాలో కంటి వెలుగు-2 శిబిరాలు 83 రోజులుగా కొనసాగుతున్నాయి. కంటి ఆపరేషన్లపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కంటి సమస్యలు ఉన్న వారికి ఆపరేషన్లు చేయించుకోవాలని చెబుతున్నాం. వారి వివరాలను నమోదు చేస్తున్నాం. కంటి ఆపరేషన్లు ఎప్పుడు చేస్తారో స్పష్టత లేదు.

– సుమన్ మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి

'సెస్' పరిధిలో స్మార్ట్ మీటర్లు

- 8న మహాసభ నిర్వహిస్తాం
- 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు



మాట్లాడుతున్న 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, ఎండీ రామకృష్ణ

సిరిసిల్ల: జిల్లాలో సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తామని 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు తెలిపారు. సిరిసిల్లలోని సెస్ ఆఫీస్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. 2019 నుంచి 'సెస్' మహాసభ జరగలేదని, కరోనా కారణంగా వాయిదా పడ్డాయని వివరించారు. జూన్ 8న ఉదయం 11 గంటలకు సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో 49వ 'సెస్' మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్‌పీడీసీఎల్ విధానంలోనే వ్యవసాయదారులకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసేలా మహాసభలో ఆమోదం పొందుతామని పేర్కొన్నారు. 'సెస్' అమలులో ఉన్న శ్రమదానం విధానాన్ని రద్దు చేస్తున్నామని వెల్లడించారు. సంస్థ ఉద్యోగుల అన్నీ సర్వీసు నియమ, నిబంధనలు రద్దు చేస్తూ నూతన సర్వీసు నిబంధనల అమలుకు బైలా మార్పులకు మహాసభలో ప్రవేశపెడతామన్నారు. సంస్థ లాభాల్లో 40 శాతం అభివృద్ధి పనులకు, 30 శాతం బిల్డింగ్ ఫండ్, మరో 30 శాతం ఎస్టాబ్లిష్‌మెంట్‌కు వినియోగించేలా సభ ఆమోదం తీసుకుంటామన్నారు. విద్యుత్ పంపిణీ సేవలను మెరుగ్గా నిర్వహించేందుకు ఔట్ సోర్సింగ్ విధానంలో సిబ్బందిని నియమించుకోవడానికి, పాలకవర్గ సభ్యుల సిట్టింగ్ ఫీజులను పెంచుటకు మహాసభలో ఆమోదం పొందుతామని వెల్లడించారు. 'సెస్' పరిధిలో ఇప్పటికే 480 మంది ప్రాతినిధ్య సభ్యుల ఎన్నికలు పూర్తి చేశామని మహాసభకు వారంతా హాజరుకావాలని ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. 2018 నుంచి 2023 వరకు అంచనా బడ్జెట్, ఆడిట్, ఆదాయాలపై మహాజభలో తీర్మానం ప్రవేశ పెడతామని తెలిపారు. సెస్ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ, సిబ్బంది రాజేందర్ పాల్గొన్నారు.

ధాన్యం తరలింపు వేగవంతం చేయండి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

- అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. లోడింగ్, అన్‌లోడింగ్ త్వరగా చేయించాలని రైస్‌మిల్లర్లకు సూచించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దబోనాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఖీమ్యానాయక్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని సూచించారు. రైస్‌మిల్లర్లు ధాన్యం కోతలు విధిస్తున్నట్లు దృష్టికొచ్చిందని.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

త్వరగా పనులు పూర్తి చేయండి

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు, పెద్దూరులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాన్ని పరిశీలించారు. జూన్ 2వ తేదీ నాటికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి వాటర్‌సంపు, సెప్టిక్‌ట్యాంక్, రోడ్లు, తదితర పనులు పూర్తిచేయాలన్నారు. జూనియర్ కళాశాల మైదానం అభివృద్ధి పనుల పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

రైస్‌మిల్లుల తనిఖీ

జిల్లాలోని 31 రైస్‌మిల్లులను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేసుకోవాలని రైస్‌మిల్లర్లను ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, ఆర్డీవో కొండల్‌రావు, జిల్లా సహకార అధికారి బుద్ధనాయుడు తదితరులు ఉన్నారు.

ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం వద్దు

- జిల్లా సహకారాధికారి బుద్ధనాయుడు



బందనకల్‌లో రైస్‌మిల్లును పరిశీలిస్తున్న జిల్లా సహకారాధికారి బుద్ధనాయుడు

ముస్తాబాద్(సిరిసిల్ల): ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం వద్దని.. మిల్లర్లు సహకరించాలని జిల్లా సహకారాధికారి బుద్ధనాయుడు సూచించారు. ముస్తాబాద్, నామాపూర్, బందనకల్‌లో రైస్‌మిల్లులను జిల్లా సహకార అధికారి బుద్ధనాయుడు గురువారం తనిఖీ చేశారు. ఖాళీగా ఉన్న మిల్లుల్లోకి ధాన్యాన్ని తరలించేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి సేకరిస్తున్న ధాన్యాన్ని వెంట వెంటనే రవాణా చేసి, మిల్లుల్లో దించుకోవాలన్నారు. నామాపూర్‌లోని ఏఎంసీ గోదాములను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం సేకరణ విజయవంతంగా నడుస్తోందని, రైతులు, మిల్లు యజమానులు, హమాలీలు సహకరించాలని కోరారు. ముస్తాబాద్ సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, సీఈవో బాలయ్య, భార్గవ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

వంశపారంపర్య హక్కును పునరుద్ధరించండి



మంత్రిని కలిసిన బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

గంభీరావుపేట(సిరిసిల్ల): ఆలయాల్లో గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు పొందుతూ పనిచేస్తున్న అర్చకులకు వంశపారంపర్య హక్కును పునరుద్ధరించాలని బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గురువారం మంత్రి హరీష్ రావును కలిసి విన్నవించారు. సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు బ్రాహ్మణ సంఘం ప్రతినిధి రాధాకృష్ణశర్మ తెలిపారు.

మన ఊరు-మన బడి పనులు పూర్తి చేయండి

- జిల్లా విద్యాధికారి రమేశ్



పాఠశాలను పరిశీలిస్తున్న డీఈవో రమేశ్

ముస్తాబాద్(సిరిసిల్ల): మన ఊరు-మనబడి పనులను పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి రమేశ్ ఆదేశించారు. నామాపూర్, బందనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చేపట్టిన పనులను డీఈవో గురువారం పరిశీలించారు. పనుల్లో జాప్యంపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. విద్యాసంవత్సరం ఆరంభంలోగా పనులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చూడాలన్నారు. సర్పంచులు వెంకటేశ్వరి, విజయ, ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

గ'మ్మత్తు'లో చిత్తు

- జిల్లాలో జోరుగా గంజాయి దందా
- ఐదు రోజుల్లో ఏడుగురి అరెస్ట్
- మహారాష్ట్ర నుంచి విత్తనాల దిగుమతి
- విచ్చలవిడిగా విక్రయాలు
- విద్యాసంస్థలు, గ్రామ శివారులే అడ్డాలు



"ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన చిట్నేని వెంకటేశ్వర్లు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతూ గంజాయికి అలవాటు పడ్డాడు. తండ్రి చనిపోగా.. తల్లి చదివిస్తోంది. తల్లి పంపిన డబ్బులను గంజాయి తాగడానికి ఖర్చు చేశాడు. చివరికి చేతిలో డబ్బులు లేక పోవడంతో గంజాయిని విక్రయించడం మొదలుపెట్టాడు. ఓసారి గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడడంతో ఆరేళ్లు జైలుశిక్ష విధించారు... ఇలాంటి యువత జిల్లాలో తమ ఉజ్వల భవిష్యత్ పాడుచేసుకుంటున్న వారు చాలా మంది ఉన్నారు."



యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీస్ అధికారులు (ఫైల్)



పోలీసులు పట్టుకున్న ఎండు గంజాయి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గంజాయి మత్తులో యువత చిత్తవుతున్నారు. మొదట ఫ్యాషన్‌గా అలవాటు చేసుకుంటున్న వారే.. రానురాను బానిసలవుతున్నారు. గంజాయి స్మగ్లర్లు యువతే లక్ష్యంగా తమ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నారు. జిల్లాలోని పలువురు విద్యార్థులు, యువత ఇటీవల పలు సంఘటనల్లో అరెస్ట్ కావడమే ఇందుకు నిదర్శనం. ఐదు రోజుల్లో ఏడుగురు అరెస్ట్ కావడం జిల్లాలో గంజాయి దందా ఎంత జోరుగా సాగుతుందో తెలుసుకోవచ్చు.

పల్లెల్లో అంతరపంటగా..

జిల్లాలోని గిరిజన తండాలలో కొందరు గంజాయిని అంతరపంటగా సాగు చేస్తున్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి విత్తనాలు కొనుగోలు చేసి గంజాయి మొక్కలను పెంచుతున్నారు. ఎక్సైజ్ అధికారులు, పోలీసులు దాడులు చేస్తున్నా సాగు ఆగడం లేదు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, కోనరావుపేట, రుద్రంగి మండలాల్లో గంజాయి సాగును అధికారులు గుర్తించారు. రుద్రంగి మండలం మానాల, వీర్నపల్లి మండలం రంగంపేట, ఎర్రగడ్డతండా, అడవిపదిరతోపాటు కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో గంజాయి సాగు చేస్తున్నట్లు అధికారుల దృష్టికొచ్చింది.

పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి గంజాయి దిగుమతి చేస్తున్నారు. పల్లెల్లో రాత్రి పూట గంజాయిని దింపుతున్నట్లు సమాచారం. ఎండిన గంజాయిని ప్రత్యేక కవర్లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్లు స్థానికంగా కొందరని ఏజెంట్లుగా ఏర్పాటు చేసుకొని గంజాయి రవాణా చేస్తున్నారు. యువత పల్లెల శివారు ప్రాంతాలను అడ్డాలుగా చేసుకొని గంజాయి సేవిస్తున్నారు. రాష్ట్రాల సరిహద్దుల్లో అధికారుల నిఘా వైఫల్యంతోనే గంజాయి పల్లెలకు చేరుతుంది. పంట చేతికొచ్చిన తరువాత గంజాయిని దిగుమతి చేసిన వారికే సాగుదారులు ఎగుమతి చేస్తున్నారు.

మత్తులో చట్టవ్యతిరేక చర్యలు

మలిసంధ్యలో తోడుగా ఉండి సాకుతాడని భావిస్తున్న తల్లిదండ్రులకు గంజాయి మత్తు ఆ బిడ్డలను దూరం చేస్తోంది. ఎంతో భవిష్యత్ ఉన్న బిడ్డలు కళ్ల ముందే మత్తులో చిత్తవుతుంటే తల్లిదండ్రులు తట్టుకోలేక పోతున్నారు. తాజాగా ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల, వేములవాడ మండలాల్లో గంజాయి మత్తులో యువత అనేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడింది. అత్యాచారాలు, హత్యలు, రోడ్డు ప్రమాదాల రూపంలో తమ జీవితాలను కోల్పోతున్నారు. ఈ ఏడాదిలో గంజాయి మత్తులో ఉన్న వారితో జరిగిన సంఘటనల్లోనే అనేక కేసులు నమోదవుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్న గంజాయిపై ఇప్పటికైన అధికారులు కొరడా ఝుళిపించాలని ప్రజలు కోరుతున్నారు.

నిఘా పెట్టాం



అసాంఘిక కార్యకలాపాలకు కారణమవుతున్న గంజాయి సాగు, విక్రయాలపై నిఘా పెట్టాం. అంతరపంటగా సాగుచేస్తున్న ప్రాంతాలను గుర్తించాం. గంజాయితో సమాజంలో అనేక అనర్థాలు జరుగుతున్నాయి. గంజాయి అమ్మకాలను నిషేధించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం. గ్రామాల్లో గంజాయి స్థావరాలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. అపరిచిత వ్యక్తులు పల్లెలకు వస్తే పోలీసులకు సమాచారం అందించాలి. ముఖ్యంగా యువత గంజాయి వ్యసనానికి దూరంగా ఉండాలి.

– మొగిలి, ఎల్లారెడ్డిపేట సీఐ

గంజాయితో అనారోగ్యం



గంజాయితో విద్యార్థులు, యువత అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతంది. అలవాటు పడితే వ్యసనంలా మారుతుంది. మత్తు లేకుండా బతకడం కష్టమనే భావనకు వస్తారు. గంజాయి మత్తులో రోడ్డు ప్రమాదాలు జరిగి ఆస్పత్రికి వస్తున్నారు. గంజాయితో కలిగే అనర్థాలపై యువతతోపాటు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తున్నాం. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి.

– సత్యనారాయణస్వామి, వైద్యుడు

క్లుప్తంగా

ప్రభుత్వం స్పందించాలి



మద్దతు తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

వేములవాడ: వీఓఏలు 20 రోజులుగా దీక్షలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించడంలేదని, తక్షణమే స్పందించి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. పట్టణంలోని తెలంగాణచౌక్‌లో వీఓఏలు చేపట్టిన దీక్షకు గురువారం ఏఐటీయూసీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. సీఎం కేసీఆర్ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తూ గుర్తింపు కార్డులు, రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గాజుల పోచెట్టి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఈయూ సిరిసిల్ల అధ్యక్షుడిగా పురుషోత్తం



పురుషోత్తం



శ్రీనివాస్

సిరిసిల్ల: సిరిసిల్ల ఎల్ఐసీ బ్రాంచి ఉద్యోగుల సంఘం (ఐసీఈయూ) అధ్యక్షుడిగా బి.పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాస్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసీఈయూ) నూతన కార్యవర్గం (2023–24) ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా జి.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా జె.నర్సింహారెడ్డి, పి.గంగారాం, కోశాధికారిగా ఎన్.బాలగంగాధర్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.కిరణ్, ఎన్.హరీశ్, వి.కావ్య, పి.భూమయ్య, జీసీఎంగా ఎస్.దినకర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి సిరిసిల్ల ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలకు ఎంపిక



అజయ్



ప్రశాంత్

వేములవాడఅర్బన్: వేములవాడ రూరల్ మండలం నూకలమర్రికి చెందిన లింగంపల్లి అజయ్, చందనం ప్రశాంత్ జిల్లాస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా క్రీడాకారులకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సోమినేని బాలు అభినందనలు తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు.

అభ్యంతరాలుంటే తెలియజేయాలి

సిరిసిల్లకల్చరల్: దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన మోటార్ వెహికిల్స్ విషయంలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం తెలిపారు. జిల్లాలో 8 మందికి రిట్రో ఫిట్టెడ్ మోటార్ వెహికిల్స్ మంజూరయ్యాయని, అర్హుల జాబితాను వెల్లడించారు. రగుడు స్వప్న, సుద్దాల గౌతమి, మారుపాక శంకరయ్య, కోనేటి బాలకిషన్, మారవేని భవాని, నక్క అనురాధ, నిదునూరి మహేందర్, అనుముల వంశీలను ప్రాథమికంగా రిజర్వేషన్ ప్రకారం ఎంపిక చేశామన్నారు. ఎంపికైన అభ్యర్థుల విషయంలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 29లోపు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

సేద్యానికి సన్నద్ధం

- ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయాధికారులు
- జిల్లా వ్యాప్తంగా 2,40,061 ఎకరాల్లో పంటల సాగు



జిల్లాలో వానాకాలం సాగు వివరాలు

పంట	సాగు అంచనా	అవసరమైన విత్తనాలు
వరి	1,62,036	32,407.2 క్వింటాళ్లు
పత్తి	74,492	2,45,868 ప్యాకెట్లు
మొక్కజొన్న	1,347	108 క్వింటాళ్లు
కంది	1,756	70.24 క్వింటాళ్లు
ఇతర పంటలు	430	8 క్వింటాళ్లు

అవసరమైన ఎరువులు

ఎరువులు	మెట్రిక్ టన్నులు
యూరియా	22,480
డీఏపీ	4,500
పొటాష్	6,000
కాంప్లెక్స్	15,000

చందుర్తి (వేములవాడ): వానాకాలం పంటల సాగుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,40,061 ఎకరాల్లో పంటల సాగు నివేదికలను జిల్లా వ్యవసాయాధికారులు సిద్ధం చేశారు. 1,62,036 ఎకరాల్లో వరి సాగు చేయనున్నట్లు అధికారుల అంచనా. 47,500 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా, ప్రస్తుతం 18వేల మెట్రిక్ టన్నుల ఎరువులు ఉన్నట్లు వ్యవసాయాధికారులు రికార్డులు చెబుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే వరి, పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటల విత్తనాలు అందుబాటులో ఉంచారు.

వరిపైనే ఆసక్తి

జిల్లా రైతాంగం వరి సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో నీటి వనరులు సమృద్ధిగా ఉండడంతో రోహిణి ముగింపు మృగశిర కార్తె లోపు నారుమడులు సిద్ధం చేసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. రోహిణి కార్తె ప్రారంభంలోనే భూసారాన్ని పెంచుకునేందుకు పొలాల్లో జీలుగ విత్తనాలను చల్లుతున్నారు. ఇతర పంటల కన్న వరి సాగు చేస్తే నాట్లు వేసేటప్పుడు తప్ప మిగత సమయాల్లో కూలీల అవసరం లేకపోవడంతో పాటు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందన్న ఆశతో రైతులు వరి సాగును ఎంచుకుంటున్నారు. అలాగే కోతులు, అడవి జంతువుల బెడద కూడా కారణంగా చెప్పవచ్చు.

74,492 ఎకరాల్లో పత్తి

జిల్లాలో ఈసారి 74,492 ఎకరాల్లో పత్తి పంట సాగులోకి రానున్నట్లు అధికారుల అంచనా. గతేడాది పత్తి ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతుల దృష్టి పత్తి పంట వైపు మళ్లింది. రైతులు పత్తి పంట సాగు చేసేందుకు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. చినుకు పడితే విత్తనాలు వేసేందుకు రెడీగా ఉన్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



వానాకాలం సాగుకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వరి, పత్తి, ఇతర పంటల విత్తనాలను మార్కెట్‌లో సిద్ధంగా ఉంచాం. రైతులు దుకాణాల్లో కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులలకు బిల్లులను తప్పకుండా తీసుకోవాలి. – భాస్కర్, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి

ఎంసెట్‌లో మెరిసిన జిల్లా విద్యార్థులు



బచ్చు అక్షయ్



హర్షవర్ధన్‌రెడ్డి



బొల్లం పూజ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/కోనరావుపేట (వేములవాడ): ఎంసెట్‌లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ర్యాంక్‌లు సాధించారు. గ్రామానికి చెందిన బచ్చు అన్నపూర్ణ–అశోక్ దంపతుల కుమారుడు బచ్చు అక్షయ్ 813వ ర్యాంక్, బొల్లం అనిత–గోవర్ధన్‌గౌడ్ కూతురు బొల్లం పూజ 12,810వ ర్యాంక్‌లు సాధించారు. వీరిని సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అపెరా సుల్తానా, గ్రామస్తులు అభినందించారు. కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి 1,660వ ర్యాంక్ సాధించాడు. కేతిరెడ్డి మహేందర్‌రెడ్డి–హేమలత కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి జేఈఈ మెయిన్స్‌లో 98.48 పర్సంటేజీ సాధించాడు.

‘దోర్నాల’కు మాజీ మంత్రి నివాళి



నివాళి అర్పిస్తున్న సుద్దాల దేవయ్య తదితరులు

సిరిసిల్ల: సిరిసిల్ల ‘సెస్’ మాజీ చైర్మన్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది దోర్నాల లక్ష్మారెడ్డికి మాజీ మంత్రి సుద్దాల దేవయ్య గురువారం నివాళి అర్పించారు. లక్ష్మారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. సిరిసిల్లలోని ఆయన ఇంటికి వచ్చిన దేవయ్య లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, ఎల్లారెడ్డిపేట మాజీ జెడ్పీటీసీ వద్నాల నర్సయ్య, సిరిసిల్ల సింగిల్ విండో మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, కామినేని నీలి శంకర్ తదితరులు ఉన్నారు.

నిరుపేద యువతి వివాహానికి రూ.లక్ష ఆర్థికసాయం



రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తున్న ఈటీసీపీ అధ్యక్షుడు రాధారపు సత్యం

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం అడవిపదిరకు చెందిన ఇటిక్యాల మంజుల–మల్లేశం దంపతుల కుమార్తె మాధవికి గురువారం వివాహమైంది. తండ్రి మల్లేశం కొద్ది నెలల క్రితం మృతిచెందగా యువతి వివాహానికి ఈటీసీపీ అధ్యక్షుడు రాధారపు సత్యం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. ఇంటి పెద్దగా నిలిచి పందిరిలోనే ఆర్థిక సాయాన్ని అందజేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. సత్యంకు యువతి కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సర్పంచ్ పాటి దినకర్, ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌కుమార్, మండల మహిళా అధ్యక్షులు కళ, సురేష్‌నాయక్, అన్నారం అజయ్, దేవరాజు, తిరుపతి, నీలం రాజేశ్‌బాబు, మాడుపు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ప్రసాదం అందజేత



బొకే అందిస్తున్న చంద్రశేఖర్

వేములవాడ: రాష్ట్ర టీఎన్జీవోల సంఘం అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్‌ను కరీంనగర్‌లో వేములవాడ రాజన్న ఆలయ పీఆర్‌వో చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. అలాగే కరీంనగర్ జిల్లా టీఎన్జీవోల సంఘం అధ్యక్షుడిగా దారం శ్రీనివాస్, కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో వారికి రాజన్న కండువా, లడ్డూ ప్రసాదం అందించినట్లు చంద్రశేఖర్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు సమయం ఆసన్నమైంది



మాట్లాడుతున్న లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎస్సీ వర్గీకరణ సాధించుకునే సమయం ఆసన్నమైందని, గ్రామాలు ఉద్యమ కేంద్రాలుగా మారాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిపేటలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదిగజాతి చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత సాధించుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. వర్గీకరణ ఉద్యమం దక్షిణ భారతదేశం మొత్తం బలంగా విస్తరించిందని, ఈ అంశాన్ని దాటవేసి ముందుకు వెళ్లే పరిస్థితి పాలకులకు కనబడడం లేదన్నారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అంశమే రాజకీయ ఎజెండాగా ఉంటుందన్నారు. ఈ కీలక దశలో గ్రామాలను ఉద్యమ కేంద్రాలుగా మార్చి మాదిగజాతి శక్తిని చాటుకోవాలన్నారు. జూన్ 5న ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో మందకృష్ణమాదిగ సభను విజయవంతం చేయాలని జిల్లాలోని మాదిగలు మాదిగ ఉపకులాలను కోరారు. సమావేశంలో నాయకులు సురేశ్, గోపాల్, రాజు, శ్రీనివాస్, ప్రహల్లద్, నర్సయ్య, రాజయ్య, దేవదాస్, మల్లేశ్ పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య



శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

చందుర్తి(వేములవాడ): భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురైన భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందుర్తి మండలం కొత్తపేటలో చోటుచేసుకుంది. చందుర్తి మండలంలోని కొత్తపేటకు చెందిన తీపీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి(35) భార్య లత కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లిపోయింది. భర్త పలుమార్లు తీసుకొచ్చేందుకు వెళ్లగా నిరాకరించింది. మనస్థాపానికి గురైన శ్రీనివాస్‌రెడ్డి బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి ఎస్సై రమేశ్ తెలిపారు.

బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న ఆది, నాయకులు

చందుర్తి (వేములవాడ): ప్రతీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు పార్టీ అధిష్టానం బీమా సౌకర్యం కల్పించిందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మూడపల్లికి చెందిన మర్రిపల్లి భాగవ్వ 8 నెలల క్రితం పత్తి చేనులో పిడుగుపాటుకు గురై మృతిచెందింది. ఆమెకు కాంగ్రెస్ సభ్యత్వం ఉండడంతో ప్రమాద బీమా పథకం కింద మంజూరైనా రూ.2లక్షల చెక్కును బాధిత కుటుంబానికి డీసీసీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి చేతుల మీదగా గురువారం సాయంత్రం అందజేశారు. కార్యక్రమంలో మర్రిగడ్డ సర్పంచ్ నేతికుంట జలపతి, జోగాపూర్, చందుర్తి ఎంపీటీసీలు మ్యాకల గణేశ్, పులి రేణుక, జిల్లా కార్యదర్శి గొట్టే ప్రభాకర్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బానాల రవీందర్‌రెడ్డి, బొజ్జ మల్లేశం, సంటి యేసుదాసు, బద్దం దామోదర్‌రెడ్డి, పుల్కం లచ్చయ్య, కాంతారావు, శంకర్, దేవయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ

సిరిసిల్లకల్చరల్: మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మూడు నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సును అందించనున్నట్లు జిల్లా మైనార్టీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. టీఎస్‌పీఎస్సీ, రైల్వే, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ వంటి ఉద్యోగాలకు ఈ ఫౌండేషన్ కోర్సు ఉపకరిస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి గల మైనార్టీ అభ్యర్థులు ఈ నెల 29లోపు దరఖాస్తులను హైదరాబాద్ గన్‌ఫౌండ్రీలోని రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ కార్యాలయానికి చేరేలా పంపించాలని సూచించారు. వివరాల కోసం 040–23236112లో సంప్రదించాలని సూచించారు.

8 లీటర్ల గుడుంబా పట్టివేత

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని జగదాంబతండాలో పోలీసులు గురువారం గుడుంబా స్థావరాల కోసం దాడులు నిర్వహించారు. ఓ ఇంట్లో 8 లీటర్ల గుడుంబా స్వాధీన చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భార్య మరణాన్ని తట్టుకోలేక భర్త మృతి



మల్లారెడ్డి(ఫైల్)

ఇల్లంతకుంట(మానకొండూరు): మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సింగిరెడ్డి మల్లారెడ్డి(90) బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాలు.. మల్లారెడ్డి భార్య చంద్రవ్వ గత సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మరణాన్ని తట్టుకోలేక ఆయన అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎంసెట్‌లో సత్తాచాటిన ‘అల్ఫోర్స్’



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ఎంసెట్–2023 ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యా సంస్థల విద్యార్థులు ఉత్తమర్యాంకులు సొంతం చేసుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కరీంనగర్‌లోని అల్ఫోర్స్ కేంద్ర కార్యాలయంలో గురువారం విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి సన్మానించి ర్యాంకుల వివరాలు వెల్లడించారు. ఎం.అభిరామ్ 301వ ర్యాంకు సాధించి అత్యున్నత స్థానంలో నిలిచాడు. ఎ.ఇషాంత్‌రెడ్డి 322, బి.శ్రీగోధ 356, జి.జ్యోతి 374, టి.దీపిక 446, ఎం.చిన్మయ్ 542, బి.శ్రీనివాస్ 650, ఎస్.సాయిసధిష్ట 681, కె.ప్రణీతరెడ్డి 752, హస్వితరెడ్డి 818, బి.విద్యాలక్ష్మి 821, ఎస్.ధీరజ్‌కుమార్ 833, ఎస్.మనస్విని 865, ఆర్.సుహాసిత 893వ ర్యాంకు సాధించారు. అలాగే వెయ్యిలోపు 14 మంది, రెండువేల లోపు 40, మూడువేల లోపు 63, ఐదువేల లోపు 118 మంది ర్యాంకులు సాధించినట్లు వివరించారు. ఇటీవల ప్రకటించిన ఐఐటీ(మెయిన్) ఫలితాల్లో విద్యార్థులు సత్తా చాటి 450 మంది ఐఐటీ (అడ్వాన్స్)కి అర్హత సాధించారని గుర్తు చేశారు. రాబోయే నీట్ ఫలితాల్లో కూడా ఉత్తమ ర్యాంకులతో ముందంజలో ఉంటామని ధీమా వ్యక్తం చేశారు.

‘శ్రీచైతన్య’ విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్: ఎంసెట్–2023 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. యు.మోహన్‌సాయి 256వ ర్యాంకు, ఎ.కీర్తన 896, కె.డింపుల్ జస్టినా 1,092, మధుకర్ 1,109, ఎస్.శ్రీనివాస్ 1,903, బి.సాయివినీత్ 2,078, ఐ.రమణి 2,770, డి.వంశీకృష్ణ 2,943, డి.కార్తీక్ 2,958వ ర్యాంకులు సాధించారు. 5వేల లోపు 12 మంది, 28 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఈసందర్భంగా రాష్ట్రస్థాయిలో అత్యున్నత ర్యాంకులు సాధించిన శ్రీ చైతన్య విద్యార్థులను వారి తల్లిదండ్రులను చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాక్రిష్ణ, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

ట్రినిటీ విజయదుందుబి

కరీంనగర్: ఎంసెట్ ఫలితాల్లో పెద్దపల్లి, కరీంనగర్ ట్రినిటీ కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఎంపీసీ విభాగంలో ఎం.రాజారెడ్డి రాష్ట్రస్థాయిలో 186ర్యాంకు, టి.అభినయ 848, ఎస్.సుహాస్‌రెడ్డి 1128, పి.శ్రీథాన్‌శాష్ 2007, బైపీసీ విభాగంలో వి.మధుకర్ 1109, డి.సాయిలక్ష్మి మానస 1969, బి.ప్రణయ్ 1976, షఫీ నౌషీన్ 2321, ఎస్.ఫాతీమా 2464, కె.లిఖిత 2479, బి.దీపక్ 2531, ఎం.రేఖ 2698, వి.అరిత్ర 2783 ర్యాంకులు సాధించారు. బి.సిరి 3126 ర్యాంకు, జి.హన్విత 3496, వి.శ్రీజ 3514, ఎం.డీ అబ్దుల్ ముజీబ్ 3675, శ్రీకిరణ్ 3752, పి.అరవింద్ కుమార్ 3875, ఎం.చంద్రశేఖర్ 4176, బి.సంధ్యవాలీ 4190, ఎం.నిత్య 4348, జి.షారోన్ 4358, ఆర్.అలేఖ్య 4519, కె.త్రిష 4529, డి.దిలీప్ కుమార్ 4558, ఆయేషా మహజాబీన్ 4759, వై.అశలేష్ 4896, బి.దీపకళ 4957, ఆర్.కావ్య 4985 ర్యాంకులు సాధించారు. రాబోయేకాలంలో మరిన్ని మంచి ఫలితాలను సాధిస్తామని ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి, కళాశాలల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

గోశాలలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను వరంగల్, మహబూబాబాద్ జిల్లాలోని గోశాలలకు గురువారం అందజేశారు. మహబూబబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం మేచ్‌రాజ్‌పల్లికి చెందిన మహాలక్ష్మి గోశాలకు, వరంగల్ జిల్లా వనపర్తి మండలం జింకురాం తండాకు చెందిన బాలాజీ గోశాలలకు 38 కోడెలు, 2 ఆవులను అందించినట్లు తెలిపారు. ఆలయ అధికారులు శ్రీనివాస్, శంకర్ తదితరులు ఉన్నారు.

తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

- కారును ఢీకొట్టిన ఇసుక ట్రాక్టర్
- రెండు ట్రాక్టర్ల మధ్య ఇరుకున్న కారు



రెండు ట్రాక్టర్ల మధ్య ఇరుకున్న కారు

సిరిసిల్లటౌన్: యూటర్న్ తీసుకుంటున్న కారును అతివేగంతో వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటన గురువారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగింది. స్థానికుల వివరాలు.. ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన రామేశ్వర్‌రెడ్డి సిరిసిల్ల నుంచి ఇంటికి కారులో వెళ్తున్నాడు. కోర్టు ఎదురుగా గల్లీ నుంచి రోడ్డు క్రాస్ చేస్తుండగా, అదే రోడ్డుపై ఇసుక అన్‌లోడ్ చేసి వస్తున్న ఖాళీట్రాక్టర్‌ను చూసి ఇరువురు బ్రేక్‌లు వేశారు. అదే సమయంలో ఇసుకలోడ్‌తో వెళ్తున్న మరో ట్రాక్టర్ అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. హఠాత్తుగా జరిగిన ఘటనలో రెండు ట్రాక్టర్ల మధ్య కారు ఇరుక్కుంది. ఈ ప్రమాదంలో రామేశ్వర్‌రెడ్డి ప్రాణాపాయం నుంచి బయటపడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్లను కట్టడి చేయాలి

పట్టణంలో ఇష్టారీతిన తిరుగుతున్న ఇసుక ట్రాక్టర్లను కట్టడి చేయాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలాంటి అనుమతులు లేకుండా, డ్రైవర్లకు లైసెన్సులు లేకుండా ఇసుక ట్రాక్టర్లను నడిపిస్తున్నారని ఆరోపించారు. కాలపరిమితి తీరిన ట్రాక్టర్లను నడిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నిబంధనలు బేఖాతర్ చేస్తూ నడుపుతున్న ట్రాక్టర్లపై చర్యలు తీసుకోకుంటే పోరాటాలు చేపడుతామని సీపీఎం నాయకులు మూశం రమేష్, కోడం రమణ తదితరులు హెచ్చరించారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

- జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు



పోటీలు ప్రారంభిస్తున్న లక్ష్మణ్‌రావు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): క్రీడలతో మానసికోల్లాసంతోపాటు క్రీడాకారుల మధ్య స్నేహభావం పెంపొందుతుందని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక పేర్కొన్నారు. మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌లో గురువారం మండలస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తుందన్నారు. ముందుగా మండల కేంద్రాల్లో క్రీడా ప్రాంగణాలను పూర్తి చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లోనూ క్రీడా మైదానాలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ పడగల రవీందర్, ఎంపీటీసీ వరద బాబు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

- విద్యుత్ కంచె తగిలి షాక్
- చెల్లె పెళ్లి కోసం దుబాయి నుంచి వచ్చిన యువకుడు



అనిల్(ఫైల్)

ఇల్లంతకుంట(మానకొండూర్): చెల్లె పెళ్లి కోసం నాలుగు నెలల క్రితం దుబాయి నుంచి వచ్చిన యువకుడు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన సంఘటన ఇల్లంతకుంట మండలంలోని రేపాకలో గురువారం విషాదం నింపింది. రేపాకకు చెందిన బైక అనిల్ (24) గురువారం ఉదయం మొక్కజొన్న చేనుకు నీళ్ల పారించేందుకు వెళ్లాడు. అయితే మొక్కజొన్న చేనును అటవి జంతువుల నుంచి రక్షించేందుకు చుట్టూ ఏర్పాటు అమర్చిన విద్యుత్ తీగలను తాకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతితో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. సంఘటన స్థలాన్ని సెస్ ఏడీ ప్రశాంత్, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఎస్సై రాజేశ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి తండ్రి బైక ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.